




మానుకోట పట్టణంలోని పార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు




కన్నులపండువగా కార్తీక పౌర్ణమి

- జిల్లాలోని శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- దీపాలు వెలిగించి, పూజలు చేసిన మహిళలు
- భక్తజనంతో రద్దీగా మారిన కందగిరి పర్వతం
- వెల్లువలా తరలివచ్చిన జనం

కార్తీక పౌర్ణమి పర్వదినం వేళ లక్ష దీపాలు వెలిగాయి.. కోటికాంతులు పలకరించాయి.. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కార్తీకపౌర్ణమి వేడుకలను భక్తులు కన్నుల పండుగగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఉసిరి, తులసి స్నానాలు ఆచరించి, శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకపౌర్ణమి రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సెలవుదినం కావడంతో భక్తులు కుటుంబ సభ్యులతో ఆలయాలకు తరలొచ్చారు. పౌర్ణమి రోజున 365 ఒత్తులను వెలిగిస్తే.. సంవత్సరమంతా శివుడికి పూజలు చేసినట్టని నమ్మకం. దీంతో మహిళలంతా జిల్లాలోని శివాలయాల్లో దీపాలను వెలిగించి కోటికాంతులు విరజిమ్మారు. మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం కందికొండలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరకు హాజరైన ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు.

- వివరాలు 6, 8 పేజీల్లో



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు కందగిరి ఎక్కుతున్న భక్తజనం

భీమునిపాదం జలపాతం అభివృద్ధికి కృషి చేస్తా

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమునిపాదం జలపాతం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తనవంతుగా అభివృద్ధికి కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతంను శుక్రవారం సందర్శించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులను డీఎఫ్‌వో బత్తుల విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, రేంజ్ అధికారి సురేష్‌లు హుస్సేన్‌నాయక్‌కు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూడూరు ఏజెన్సీ మండలంలో అరుదైన జలపాతంగా భీమునిపాదం గుర్తింపు పొందిందన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పర్యాటకులు వచ్చి సేదతీరుతున్నట్లు చెప్పారు. పర్యాటకులకు సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భీమునిపాదంలో మౌలిక వసతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఐబీ డీఈ ఉపేందర్, ఐటీడీఏ ఏఈ శోభన్, వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గండి చెరువు సందర్శన..

గూడూరు మండలం మచ్చర్ల-లైన్‌తండ-గూడూరు అటవీప్రాంతంలో ఉన్న గండి చెరువును జాటోతు హుస్సేన్‌నాయక్ శనివారం సందర్శించనున్నారు. గండి చెరువును రిజర్వాయిర్‌గా చేస్తే బీడు భూములు సాగు భూములుగా మారుతాయని, దీంతో రైతులకు రెండు పంటలకు సాగునీరు అందనుంది.



భీమునిపాదాన్ని సందర్శిస్తున్న జాటోతు హుస్సేన్‌నాయక్

మహోన్నత వ్యక్తి బిర్సాముండా

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్

మహబూబాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి, ఆదివాసీల ఆరాధ్య దైవం భగావాన్ బిర్సాముండా అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జన్ జాతీయ గౌరవ్ దివాస్ దినోత్సవం, బిర్సాముండా జయంతిని నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూమి, నీటి కోసం, భూమి శిస్తును వ్యతిరేకిస్తూ గిరిజనజాతి అభివృద్ధికి నిరంతరం పోరాటం చేసిన యోధుడు బిర్సాముండా అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని బిర్సాముండా జయంతి రోజున కేంద్రప్రభుత్వం జాతీయ యువ దినోత్సవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బిర్సాముండా తన చిన్నతనంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ వారిని గడగడలాడించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మ్ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పించడం కోసం రూ.24 వేల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 92 గ్రామాలను ఎంపిక చేశారని తెలిపారు.

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన గ్రామాలకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని పాలించిన మహనీయులు బిర్సాముండా అని చెప్పారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బిర్సాముండా బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం పోరాడారని చెప్పారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధఉత్పత్తుల స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, మునిసిపల్ వైస్ మార్చైని వెంకన్న, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఎర్రయ్య, సైదా, కలెక్టరేట్ ఏవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.



జయంతి సభలో మాట్లాడుతున్న రాంచందర్‌నాయక్

ఒక మంచి పుస్తకం.. వందమంది మిత్రులతో సమానం

- జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒక మంచి పుస్తకం.. వందమంది మిత్రులతో సమానమని డీఈవో వి.రాజేశ్వర్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు మేధో సంపత్తికి నిలయాలని విద్యార్థులు, యువకులు వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని చెప్పారు. ప్రతీ ఒక్కరు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జి.విజయేందర్, సీహెచ్.రవి, రుద్రారపు వీరేందర్, బొడ్డుపల్లి భూలక్ష్మి, అశోక్, అనిల్, సతీష్, గ్రంథాలయ పాఠకులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న రాజేశ్వర్

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

- హాజరుకానున్న రాష్ట్ర నేతలు వీరయ్య, నాగయ్య

డోర్నకల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా సీపీఎం పార్టీ 3వ జిల్లా మహాసభలను డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని వై.వెంకటయ్యనగర్‌లోని బిషప్ అజరయ్య ఫంక్షన్ హాల్లో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు ఉప్పనపల్లి శ్రీనివాస్, బొమ్మన అశోక్‌కుమార్, ఎండీ నవాబ్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశాల ప్రారంభం సందర్భంగా డోర్నకల్‌లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి వై.వెంకటయ్యనగర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య, పాలడుగు భాస్కర్ హాజరు కానున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు దాసోహమయ్యారని అన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా సీపీఎం ఎదగనుందన్నారు. ఈ మహాసభల్లో జిల్లాలోని సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యచరణను రూపొందించనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పోడు పట్టాలపై రుణాలకు కొర్రీలు!

- పట్టా ఉన్నా అటవీశాఖ ధ్రువీకరణ తప్పనిసరి
- ఫీల్డ్ ఆఫీసర్ క్షేత్ర పరిశీలన తర్వాతే రుణం
- నకిలీ పాస్‌పుస్తకాల ఉదంతంతో అప్రమత్తమైన బ్యాంకర్లు
- సకాలంలో అప్పులు అందక పోడు రైతుల ఆవేదన



మహబూబాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములకు జారీ చేసిన హక్కు పట్టాలపై పంట రుణాలను ఇచ్చేందుకు బ్యాంకుల అధికారులు కొర్రీలు పెట్టడంతో పోడు రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్నిరోజుల క్రితం ములుగు జిల్లాల్లో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాల ఉదంతం వెలుగులోకి రావడంతో బ్యాంకర్లు అప్రమత్తమయ్యారు. ములుగు కేంద్రంగా ములుగు, మహబూబాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వందల సంఖ్యలో నకిలీ పోడు భూముల పట్టాలను కొందరు ముఠాగా ఏర్పడి, తయారు చేసి రైతులకు విక్రయించగా పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్యాంకుల్లో పోడు పట్టాలకు సగానికి పైగా వానాకాలం పంట రుణాలను ఇచ్చిన తర్వాత, కొత్త రుణాల జారీని నిలిపివేశారు. దశాబ్దాల కాలం నుంచి పోడు సాగు చేసుకుంటున్న రైతులకు 2005 అటవీహక్కుల చట్టం ప్రకారం పోడు హక్కుపత్రాలు తెలంగాణ సర్కార్ జారీ చేసింది. ఇన్ని సంవత్సరాలుగా ఎదురు చూసిన తమకు పోడుపట్టాలు వచ్చినా బ్యాంకుల కొర్రీలతో పంట రుణాలు అందకుండా పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో ఇలా..

మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గంగారం, గార్ల, గూడూరు, కొత్తగూడ, కేసముద్రం, కురవి, మహబూ బాబాద్, నెల్లికుదురు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో 33,560 మంది రైతులు 1,00,500 ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారు. వీరందరికీ 2005 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2008లో 8,560 మందికి 25,500 ఎకరాలకు పోడు పట్టాలను జారీ చేయగా.. సుదీర్ఘ కాలం అనంతరం 2023లో 25,000 మంది రైతులకు 75,000 ఎకరాల్లో అటవీహక్కు పత్రాలను ప్రభుత్వం అందజేసింది. గ్రామ సభల్లో ఆమోదించిన దరఖాస్తులను సబ్‌డివిజన్ లెవల్ కమిటీ (ఎస్‌డీ ఎల్‌సీ) పరిశీలించి, జిల్లా లెవల్ కమిటీ (డీఎల్‌సీ)కి పంపించారు. ఈ రెండు కమిటీలు పరిశీలన చేసిన అనంతరం కలెక్టర్ లాగిన్‌లో అనుమతిచ్చి పోడు పట్టాలను జారీ చేశారు. 2021 అక్టోబరులో హక్కుపత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా 2023, మే, జూన్ నెలల్లో జారీ చేశారు. అలా జారీ అయిన పోడు హక్కు పత్రాల్లో విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్న ఘటనలు పలు గ్రామాల్లో వెలుగులోకి వచ్చాయి. కొంతమంది సాగు చేయకుండా అటవీశాఖ నెంబర్లతో హక్కు పత్రాలను పొందినట్లు ఆరోపణలు రాగా.. మరి కొందరికి పట్టాలురాకపోవడం లాంటివి ఉన్నాయి.



నకిలీల నేపథ్యంలో బ్యాంకుల కొర్రీలు..

పోడు పట్టాల్లో నకిలీలతో పాటు అవకతవకలు చోటు చేసుకోవడంతో బ్యాంకులు అప్రమత్తమై రుణాల జారీలో అనేక నిబంధనలను విధించాయి. ఫలితంగా పోడుపట్టాలకు పంట రుణాలను ఇవ్వడం నిలిచిపోయాయి. అంతకుముందు రెవెన్యూ అధికారు లు భూమి ఉన్నట్లుగా ధ్రువీకరించి ఇస్తే వాటి ఆధారంగా పంట రుణాలను మంజూరు చేశారు. ఈ క్రమంలోనే ములుగు కేంద్రంలో నకిలీ పోడు పట్టాల ఉదంతం బయటపడటం, సదరు ముఠా మహబూబాబాద్ జిల్లాలోను వందల సంఖ్యలో పట్టాలను జారీ చేసినట్టు సమాచారం అందడంతో బ్యాంకులు రుణాలను ఇవ్వడం నిలిపి వేశాయి. తాజాగా నూతన నిబంధనలను జారీ చేసినట్టు మిగతా 8వ పేజీలో..



పోడు పట్టాలున్నా బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని చెబుతున్న ఇనుగుర్తి మండలం కోమటిపల్లి తారాసింగ్‌తండా రైతులు(ఫైల్)

బయ్యారం పెద్దచెరువు కట్టపై.. గుప్తనిధుల కోసం తవ్వకాలు?

- కట్ట మైసమ్మ విగ్రహం అపహరణ
- ప్రదేశాన్ని పరిశీలించిన పోలీసులు



బయ్యారం చెరువు కట్టపై గుప్త నిధుల కోసం తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి

బయ్యారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు కట్టపై గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి తవ్వకాలు జరిపిన ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో కలకలం రేపుతుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బయ్యారం పెద్ద చెరువు కట్టపై దశాబ్దాల కాలంగా కట్ట మైసమ్మ విగ్రహం ఉండేది. రైతులు, ప్రజలు నిత్యం ఆ విగ్రహానికి పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం కట్టపైకి వెళ్లిన పలువురు సమీప ప్రాంత ప్రజలకు కట్ట మైసమ్మ విగ్రహం కనిపించకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. అంతేకాక జేసీబీతో పెకిలించి విగ్రహాన్ని అపహరించినట్లు ఆనవాళ్లు కన్పించడం.. విగ్రహం తొలిగించిన ప్రదేశంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు కన్పించడంతో గుప్త నిధుల కోసం ఏమైనా క్షుద్రపూజలు నిర్వహించి ఉంటారా.! అన్న అనుమానంతో విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతితో సహా సిబ్బంది ఘటన స్థలికి చేరకొని విగ్రహం అపహరణకు గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. కాగా, ఇరిగేషన్ ఏఈ అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కలకలం, చర్చనీయాంశం..!

కాకతీయుల నాటి బయ్యారం పెద్దచెరువు కట్టపై గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు నిర్వహించడం కలకలం రేపుతుంది. గతంలో గుప్త నిధుల కోసం చెరువుకట్టపై పలుమార్లు తవ్వకాలు జరిపినట్లు ప్రచారం సాగుతున్న తరుణంలో తాజాగా మళ్లీ తవ్వకాలు జరపటం చర్చనీయాంశంగా మారింది. కాగా, గుప్త నిధుల కోసం వేటాడుతున్న అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఆ కోణంలో విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఎవరెవరు.. ఏఏ ప్రాంతాల్లో.. ఎప్పుడెప్పుడు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. వారు నివసిస్తున్న ప్రదేశాలు ఎక్కడా.. ప్రస్తుతం వారి జీవనస్థితిగతులు తదితర అంశాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఏదేమైనప్పటికి చెరువు కట్టనే లక్ష్యంగా చేసుకొని గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టడం మండలంలో కలకలం రేపుతుంది. నిత్యం వ్యవసాయ పనుల నిమిత్తం చెరువు ప్రాంతాల్లో సంచరించే రైతులు క్షుద్రపూజలతో భయందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ములుగులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బలరాంనాయక్

'గోర్ మళావో' కరపత్రం ఆవిష్కరణ

ములుగు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుడితండాలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే గోర్ మళావో కార్యక్రమ కరపత్రాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ ములుగులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏక్‌వాత్, ఏక్‌జాత్, ఏక్ సాత్ అనే నినాదంతో సేవాలాల్ మేరమ్మయాడీ చూపిన మార్గంలో బంజారాలు కలిసికట్టుగా తమ ఆశయాల కోసం పని చేయాలన్నారు. గోర్ మళావో కార్యక్రమంలో బంజారాలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, సేవాలాల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోరిక సునీల్‌నాయక్, నాయకులు బోడ కిషన్, పోరిక రాహుల్, పాల్తియా సారయ్య, రాజ్‌కుమార్, శ్యామల్‌నాయక్, వినయ్, రాజు, సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల
పీడీఎస్ బియ్యం పట్టివేత

చిలుపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా 15 క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యం తరలిస్తున్న మూడు ప్యాసింజర్ ఆటోలను పట్టుకుని, వాటి యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని మడికొండ, రాంపూర్‌కు చెందిన వల్లెపు రమేష్, పొట్లబత్తిని రమేష్, ఆలకుంట రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఎవరికీ అనుమానం రాకుండా ఉదయం పూట ప్యాసింజర్ల కోసం ఆటో నడుపుతూ, రాత్రుళ్ళు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. కాగా, గురువారం సాయంత్రం మూడు ఆటోలలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేపట్టామన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించి, ఆటోలను సీజ్ చేసి, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నాలుగో తరగతి ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

ములుగు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని నాలుగో తరగతి ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రమేష్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ములుగు మండలంలోని జాకారం వైటీసీలో జరిగిన కార్యక్రమంలో పీవోను కలిశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు కాంటిజెంట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి దినసరి వేతనం నెలనెలా వచ్చేవిధంగా చూడాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు నెలనెలా ఇవ్వాలని కోరారు.



ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు సమస్యలను వివరిస్తున్న ఉద్యోగులు

కన్నుల పండువగా.. లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కురవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని కురవి మండలం కందగిరి పర్వతంపై లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. వల్మీకి (పుట్ట) రూపంలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామికి ఎదురుగా అర్చకులు చిత్రపటాలను ఉంచి వివాహతంతును జరిపించారు. వందల ఏళ్ల నుంచి ఈ వివాహమహోత్సవం స్వామివారికి నిర్వహిస్తున్నట్లు అర్చకుడు నల్లప్రోల్ పురుషోత్తమాచార్యులు తెలిపారు. స్వామివారికి శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాతసేవ అనంతరం ఆలాపన, అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు రామానుజాచార్యులు, నర్సింహాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామి వారి చిత్రపటాలకు కోనేరులో స్నానమా చరించి, ఉదయం 4గంటలకు బ్రహ్మ ముహూర్తంలో కళ్యాణం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తలు స్వామివారికి వస్త్రాలు సమర్పించగా, అనంతరం పూజాకార్యక్రమాలను అర్చకులు కొనసాగించి 5.30 గంటలకు కల్యాణాన్ని పూర్తి చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను పంచి భక్తుల దర్శనార్థం స్వామివారిని ఉంచారు.

ఆకట్టుకున్న అఖండజ్యోతి..

శుక్రవారం సాయంత్రం గుట్టపై ఉన్న ఆలయం పైభాగంలో అఖండ జ్యోతిని వెలిగించారు. మట్టి మూకుడులో కందికొండ ఆలయంపై భాగాన అఖండజ్యోతిని వెలిగించారు. ఈ మూకుడు నిండా నూనెపోసి, వస్త్రముతో మడతవేసి, పెద్దవత్తిగా చేసి వెలిగించారు. ఈ దీపంలో నూనెను కందికొండ గ్రామానికి చెందిన ముస్లింలు అందించడం విశేషం. ఈ దీపం



లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కందగిరి ఆలయంపై అఖండ జ్యోతి



ఆలయం వద్ద జన సందోహం

ఉదయం 4 గంటల నుంచి 5.30 వరకు పూర్తి

గుట్ట నుంచి 40 కిలోమీటర్ల దూరం వరకు కనిపించింది. తరతరాలుగా ముస్లింలు నూనెలు అందించడం ఆచారంగా వస్తోంది.

కందికొండకు కార్తీక సోయగం

- భక్తజనంతో రద్దీగా కందగిరి పర్వతం
- వెల్లువలా తరలి వచ్చిన జనం



కందగిరి మెట్ల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్

కురవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కందికొండ పర్వతంపై శుక్రవారం జరిగిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా జనం తరలిరావడంతో పర్వత పరిసర ప్రాంతాలు రద్దీగా మారా యి. నర్సింహస్వామి, లక్ష్మీదేవిల కల్యాణానికి హాజరై స్వామివారిని దర్శించుకోవడంతో కందగిరి భక్తజనంతో నిండుకుండగా మారింది. శుక్రవారం కార్తీకపౌర్ణమి కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కందికొండకు తరలివచ్చి, సుమారు మూడు కిలోమీటర్ల ఎత్తులోని పర్వతాన్ని అధిరోహించారు. గుట్టపై పుష్కరిణి (కోనేటి)లో స్నానం చేసి, లక్ష్మీనర్సింహుడి ఆల యంలో మొక్కులు తీర్చుకున్నారు. తిరుగు ప్రయాణంలో మొదటిగుట్టపై ఉన్న గుహ వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

జాతరకు పోటెత్తిన జనం..

ఈ సారి కందికొండ జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గిరిజన భక్తులతో సహా, గిరిజనేతరులు సైతం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై ఈ సారి అధికంగా తరలివచ్చారు. కాలినడకన వచ్చే భక్తులు పూర్తిగా కనుమరుగు అయ్యారు. కందగిరి వద్ద జాతరలో దుకాణాలు, వనమూలికలతో కోయవారు, పాతకొత్త రకం దుకాణాలతో భిన్న సంస్కృతులు కనిపించాయి. గుట్టను అధిరోహించిన భక్తులు ఉసిరిచెట్ల ఆకులు, ఇతర వనమూలికలు, కోనేటి నీటిని వెంట తెచ్చుకున్నారు.

భారీ బందోబస్తు..

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మహబుబాబాద్ డీఎస్పీ కృష్ణకిషోర్ నేతృత్వంలో ఏడుగురు సీఐలు, 20మంది ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షించారు. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, ఎంపీవో గౌస్, ఏపీవో ఏకాంబ్రం ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం మొత్తం జాతర విధులు నిర్వహించారు. జాతరలో బలపాల, కురవి పీహెచ్‌సీ వైద్యులు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జాతరలో బోర్లు, వేయించడంతో పాటు, ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ ప్రత్యేక పూజలు

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ గుట్టక్రింద మెట్ల వద్ద ఆయన సతీమణి ప్రమీలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కిసాన్‌పరివార్ సీఈవో వివేక్, కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, బండి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, కోర్ని రవీందర్ రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్ ఉన్నారు.

కందికొండను పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృషి

కురవి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనర్సింహస్వామి వెలిసిన కందికొండను పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృషి చేస్తామని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్, రాష్ట్ర పర్యాట కశాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. కందికొండలోని కందగిరి పర్వతాన్ని శుక్రవారం సందర్శించి, మెట్లవద్ద పూజలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందికొండ విశిష్టతను సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపి, ఈ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు తీసుకువస్తామన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో జ్వాలాతోరణం

కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో జాటోతు రాంచందర్‌నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, పటేల్ రమేష్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు మాలోతు నెహ్రూనాయక్ జ్వాల తోరణ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయంలో శివలింగ ఆకారంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవంలో పాల్గొని ప్రమిదలను వెలిగించారు. ఆయా కార్యక్రమాల్లో కురవి దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఇస్లావత్ సుధాకర్‌నాయక్, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, బాదె వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



జ్వాలతోరణ పూజలో పాల్గొన్న విప్ రాంచందర్‌నాయక్, రాష్ట్ర పర్యాటకశాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

దోష నివారణ పేరుతో కుచ్చుటోపీ

- రూ.55 లక్షలు కాజేసిన ట్రాన్స్‌జెండర్
- జనగామ జిల్లాలో ఘటన.. కేసు నమోదు

జనగామ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో దోషం ఉందని, అది తొలగాలంటే దోష నివారణ పూజలు చేయాలంటూ ఓ మహిళ, ఆమె తమ్ముడికి ఓ ట్రాన్స్‌జెండర్ కుచ్చుటోపీ పెట్టింది. వారి బలహీనతను ఆసరాగా తీసుకున్న సదరు ట్రాన్స్‌జెండర్ శాంతి పూజలు పేరుతో ఏకంగా రూ.55 లక్షల వరకు వసూలు చేసింది. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామలోని వెంకన్నకుంటకు చెందిన ఉప్పల సిరివెన్నెలకు జనగామకే చెందిన నిరోష అనే స్నేహితురాలి ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సత్యనారాయపురం గ్రామానికి చెందిన నాగదేవి అనే ట్రాన్స్‌జెండర్ పరిచయం అయింది. ఈ ఏడాది జూన్ నెలలో జనగామకు వచ్చిన నాగదేవిని సిరివెన్నెల కలిసి తన కుటుంబ పరిస్థితి గురించి వివరించింది. మీ ఇంట్లో దోషం ఉందని, అది తొలగాలంటే పూజలు చేయాలని నమ్మించింది. దీనికి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమవుతాయని చెప్పింది. ఈ విషయాన్ని సిరివెన్నెల మేడ్చల్‌లో ఉంటున్న తన తమ్ముడైన నిఖిల్‌కు వివరించింది. దీంతో ఓసారి జనగామలో, ఓసారి మేడ్చల్‌లోని నిఖిల్ ఇంటికి నాగదేవి వచ్చి పూజలు చేసింది. పలు దఫాలుగా మొత్తం రూ. 55 లక్షల వరకు బాధితుల నుంచి వసూలు చేసింది. రూ.13 లక్షలు క్యాష్ రూపంలో, మిగతావి ఫోన్‌పే, అకౌంట్‌పే రూపంలో చెల్లించారు. కాగా.. పూజలు చేసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంట్లో పరిస్థితులు చక్కబడకపోవడంతో బాధితులు సిరివెన్నెల, నిఖిల్ ఈనెల 13న నాగదేవి జనగామకు వచ్చిన విషయాన్ని తెలుసుకొని వెళ్లి నిలదీశారు. మోసపోయామని గ్రహించి అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. ఈ విషయంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయి తాగుతున్న విద్యార్థులపై కేసు

హసన్‌పర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్న హసన్‌పర్తి పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల బాలుర హాస్టల్ వెనుక కొందరు విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ శీలం రవి సిబ్బందితో చేరుకొని తని ఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గంజాయి తాగుతూ కనిపించిన నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 24 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ చేరాలు వెల్లడించారు. గంజాయి తాగేందుకు ఉపయోగించిన బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

జోనల్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కాటారం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కాళేశ్వరం జోనల్ మీట్‌లో భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. కబడ్డీ అండర్-14, షాట్‌పుట్ అండర్-14 విభాగంలో సృజన, డిస్కస్ త్రోలో హరిప్రియ జోనల్ ద్వితీయ స్థానం సాధించి తమ సత్తా చాటారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ మానస తెలిపారు.

ఈ విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, పీడీ అమ్మాజీ, పీఈటీ రాజేశ్వరి, టీజీపీఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందుగుల రాజన్న, అధ్యాపకులు అభినందించారు.



షీల్డులు అందుకుంటున్న విద్యార్థినులు

వృద్ధురాలికి అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

రేకుల ఇంటిని ప్రారంభించిన నాయకులు



రేకుల ఇంటిని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోవిందరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కురిసిన అధిక వర్షాలకు మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన సగులూరి వెంకటమ్మ అనే వృద్ధురాలి ఇంటి గోడలు కూలిపోయి నిరాశ్రయురాలిగా మిగిలిపోయింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా ఇంటి మరమ్మతుల నిమిత్తం రూ.16వేలను మంజూరు చేశారు. దీంతో స్థానిక నాయకులు ఇంటి పైకప్పుగా రేకులు వేయించి ఉండడానికి ఆశ్రయం కల్పించారు.

ఈమేరకు శుక్రవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణలు రేకుల ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటమ్మను అన్నివిధాలుగా ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌పే చేశానని బురిడీ

- మోసానికి గురైన పంక్చర్‌షాపు నిర్వాహకుడు
- వాదనతో ఏమార్చిన ఆగంతకుడు

కేసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టైర్లను కొనుగోలు చేసిన డబ్బులను ఫోన్‌పే చేశా ని చెప్పి అగంతకుడు వెళ్లిపోయిన ఘటన కేసముద్రంలో చోటు చేసుకుంది. స్థానిక అంబేద్కర్ సెంటర్ సమీపంలో టైర్ పంక్చర్ షాపు నిర్వాహకుడు సుందర్ వెంకన్నకు టైర్లు విక్రయించే షాపు కూడా ఉంది.

గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి షాపు వద్దకు వచ్చి తన బైక్ రెండు టైర్లు మార్చాలని కోరడంతో రూ.3800 అవుతుందని సుందర్ వెంకన్న తెలిపారు. ఆపై టైర్లను మార్చిన అనంతరం ఫిట్టింగ్ చార్జీ వంద కలిపి రూ.4000లు ఇవ్వాలని సుందర్ వెంకన్న కోరాడు. దానికి అగంతకుడు రూ.3800 ఫోన్‌పే చేశానని తెలుపడంతో ఫిట్టింగ్ చార్జీ రూ.200ల విషయంలో ఇరువురి మధ్య వాదన జరిగింది. చివరకు రూ.100 రేపు ఇస్తానని చెప్పి అగంతకుడు బైక్‌ను తీసుకు వెళ్లిపోయాడు.

శుక్రవారం ఉదయం తన ఫోన్‌పే చెక్ చేసుకుంటే అసలు రూ.3800లు కూడా సుందర్ వెంకన్నకు రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి కంగుతిన్నాడు. ఫిట్టింగ్ చార్జీ చెల్లింపులో కావాలనే వాదన పెట్టుకొని డబ్బుల విషయంలో దృష్టి మళ్లించి మోసం చేశాడని పలువురు భావిస్తున్నారు.



బాధితుడు వెంకన్న

రామప్పను సందర్శించిన ప్రముఖులు

వెంకటాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని పలువురు ప్రముఖులు శుక్రవారం సందర్శించారు. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి జ్ఞానేష్‌భారతి, పీసీసీఎఫ్ సునీత భగవత్ స్వామి వారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, పూజారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం జ్ఞానేష్‌భారతి, సునీత ఆలయ శిల్పకళా సంపదను వీక్షించారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్ ద్వారా తెలుసుకున్నారు. జ్ఞానేష్‌భారతి వెంట డైరెక్టర్లు సంబల్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న జ్ఞానేష్ భారతి,



రామలింగేశ్వర ఆలయంలో హారతి స్వీకరిస్తున్న సునీత భగవత్

కార్తీకం.. నేత్రపర్వం..


వేయి స్తంభాల ఆలయంలో క్యూలో వేచియున్న భక్తులు


పౌర్ణమి చంద్రుడికి దీపాలు చూపుతున్న యువతులు




రామప్ప ఆలయం ఆవరణలో శివలింగం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పౌర్ణమి వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు

- దీపాలు వెలిగించిన మహిళలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కార్తీక పౌర్ణమి వేళ చారిత్రక ఓరుగల్లులోని శివాలయాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలు, శైవక్షేత్రాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.
శుక్రవారం తెల్లవారుజాము నుంచే శివుడికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలతో సందడి కనిపించింది. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సమయంలో దీపోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంతో పాటు పలు ఆలయాలు దేదీప్యమానమై వెలుగొందాయి. శివుడికి ప్రీతికరమైన కార్తీక పర్వదినాన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.


కాళేశ్వరం వద్ద గోదావరి తీరంలో భక్తుల రద్దీ


కాళేశ్వరం వద్ద గోదావరిలో నూనె దీపాలు వదులుతున్న మహిళలు


కాళేశ్వరాలయంలో అఖండ దీపానికి మొక్కుతున్న యువతి


మహబూబాబాద్ వేణుగోపాలస్వామి ఆలయంలో పుష్పార్చన చేస్తున్న మహిళలు

భద్ర 'ఖాళీ'

నీటి తరలింపుతో బోసిపోయి కనిపిస్తున్న చెరువు


నీరంతా పోవడంతో ఖాళీగా, బోసిపోయి కనిపిస్తున్న భద్రకాళి చెరువు


మిగిలిన నీళ్లలోని చేపలను పడుతున్న మత్స్యకారులు

హనుమకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం నడిబొడ్డున్న చారిత్రకంగా ఎంతో సుప్రసిద్ధమైన భద్రకాళి చెరువులోని నీళ్లన్నీ ఖాళీ అయ్యాయి. భద్రకాళి చెరువులోని పూడికను తీసి వేసి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా లోతు చేసేందుకు, చెరువులోని గుర్రపు డెక్క, నాటు, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి పరిశుభ్రం చేసేందుకు వారం కిందట చెరువులోని నీళ్లను నీటి పారుదల శాఖ ఖాళీ చేస్తోంది.

చెరువులోని నీరంతా దాదాపు ఖాళీ అయింది. అక్కడక్కడా ఇంకా నీరు మిగిలి ఉంది. ఆ నీటిలోని చేపలను మత్స్యకారులు పట్టుకుంటున్నారు. చెరువు ఖాళీ కావడంతో బోసిపోయి కనిపిస్తోంది. అంతకు ముందు సంవత్సరం పొడవునా నీటితో చెరువు కళకళలాడుతూ ఉండేది. భద్రకాళి గుడికి వచ్చే భక్తులకు కనువిందు చేసేది. సుమారు దశాబ్దన్నర కిందట వేసవి కాలంలో పూర్తిగా చెరువు ఎండిపోయింది. అప్పుడు చెరువు మధ్యలో ఉన్న చిన్నమట్టి దిబ్బ వద్ద కొన్ని దేవతా శిల్పాలు లభించాయి.

వాటిని పురావస్తుశాఖ స్వాధీనం చేసుకొని మ్యూజియంలో భద్రపరిచింది. నీళ్లు ఖాళీ అయి ఇప్పుడు ఖాళీగా కనిపించడం రెండోసారి. చెరువులో నీళ్లున్నప్పుడు పర్యాటక శాఖ బోట్లను నడిపేది. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో బోటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. చెరువు పూర్తిగా ఎండిపోయిన తర్వాత పూడికతీత పనులు మొదలు పెడతారు. చెరువులో పూడికను తొలగిస్తున్నప్పుడు గతంలో మాదిరిగానే దేవతా ప్రాచీన శిల్పాలు, దేవతా మూర్తుల విగ్రహాలు లభించే అవకాశం లేకపోలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

ఎనిమిది కొలువులు కొట్టిన యువకుడు

తన దారిలోనూ తమ్ముడు.. ఒక ఉద్యోగానికి ఎంపిక

నల్లబెల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని జయించారు. తమ తల్లిదండ్రులు పడిన కష్టాన్ని ప్రతిఫలంగా ప్రభుత్వ ఉద్యోగాలను పొందారు ఆ అన్నదమ్ములు. వారిలో అన్న ఏకంగా ఎనిమిది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవగా.. అన్నను స్ఫూర్తిగా తీసుకున్న తమ్ముడు ఒక కొలువుకు ఎంపికయ్యాడు. అలా చదువులో సత్తా చాటి అందరి మన్ననలు అందుకున్నారు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన రాయరాకుల రాజేశ్, సంతోష్. నల్లబెల్లి గ్రామానికి చెందిన రాయరాకుల సాంబయ్య, సుగుణ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సాంబయ్య చాకలి వృత్తిని కొనసాగిస్తుండగా.. సుగుణ కూలి పనులకు వెళ్తూ కుమారులను చదివించారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన కుమారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్దకుమారుడు రాజేష్ 10వ తరగతి నల్లబెల్లిలోని ఉదయశ్రీ హై స్కూల్, ఇంటర్ నర్సంపేటలోని కాకతీయ కాలేజీ, డిగ్రీ ఆచార్య కాలేజీ, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో చదివాడు. అనంతరం అదే ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో ప్రభుత్వ కొలువులకు ప్రిపేర్ అయ్యాడు.


ఆనందాన్ని తల్లిదండ్రులతో పంచుకుంటున్న రాజేష్, సంతోష్

మొదటి కొలువు పంచాయతీ కార్యదర్శిని సాధించాడు. అదే స్ఫూర్తితో ఏఎస్‌వో, గురుకుల పీజీటీ, టీజీటీ గురుకుల, హాస్టల్ వేల్ఫేర్ గ్రేడ్ 2, గ్రూప్ 4, డీఎస్సీ, జేఎల్ ఇలా 8 ప్రభుత్వ కొలువులను సాధించాడు. ప్రస్తుతం పీటీజీ గురుకులం అడవి మల్లంపల్లిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ తర్వాత తన అన్న స్ఫూర్తి, ఇచ్చిన సలహాలతో సంతోష్ కూడా బీటెక్ పూర్తి చేసి నల్లబెల్లి గ్రంథాలయంలో చదువుతూ గ్రూప్ 4ను సాధించాడు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ క్వాలిఫై అయి మెయిన్స్ ఎగ్జామ్ కూడా రాసి ఫలితాల కోసం వేచి చూస్తున్నాడు.

ఇద్దరు అన్నదమ్ములు ప్రభుత్వ కొలువుల్లో సత్తా చాటుతుండడంతో వారి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. ప్రజలు, స్నేహితులు, బంధువుల నుంచి వారికి అభినందనల వెల్లువెతుతున్నాయి. నేటి యువతకు ఈ ఇద్దరు అన్నదమ్ములు ఆదర్శమని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

గో హత్యలు ఆపి, ప్రకృతిని కాపాడుకుందాం

- సనాతన ధర్మ రక్షణకు పర్యటిస్తున్నా
- వర్ధన్నపేటలో అఘోరీ నాగసాధు
- స్త్రీల జోలికొస్తే అంగాన్ని కోస్తా అంటూ సంచలన వ్యాఖ్యలు

వర్ధన్నపేట రూరల్/ శంభునిపేట / వరంగల్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోహత్యలు ఆపి.. ప్రకృతిని కాపాడుకుందామని, ఆడపిల్లలను రక్షించుకోవాలని అఘోరీ నాగసాధు పేర్కొన్నారు. ఇటీవల పలు సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కిన అఘోరి.. శుక్రవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికొచ్చారు. ఈ క్రమంలో కాలభైరవస్వామి ఆలయాన్ని సందర్శించాలని ఆ ఆలయ పూజారి రాము కోరడంతో అఘోరీ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలకు బొట్టు పెడుతూ దీవెనలందించిన అఘోరి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవడానికి తాను రాష్ట్రంలో పర్యటిస్తున్నానన్నారు. స్త్రీలను ముట్టుకోవాలంటే గజగజలాడాలని, అలాంటి విపత్తు రాబోతోందని, స్త్రీల జోలికి వస్తే అంగాన్ని కోస్తానని, త్వరలోనే ఒకరి అంగాన్ని కోయబోతున్నానని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. తనకు లోకజ్ఞానం చాలా తక్కువని, ఎక్కువగా హిమాలయాల్లో ఉండడం వలన ఇక్కడి విషయాలు తెలియవన్నారు. ప్రజారంగంలోకి వచ్చిన తర్వాత నేర్చుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో నేలపై కూర్చొని విస్తరాకు లేకుండానే మట్టిపై అన్నం, పప్పు, చారు కలుపుకొని భుజించారు.

అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను అన్నం తినబోనని శవాలనే తింటానని స్పష్టం చేసిన అఘోరీ ఇలా నేలపై అన్నం తినడం చర్చనీయాంశమైంది.

మామునూరు శ్మశానంలో..

వర్ధన్నపేట మండలం ఇల్లందులోని కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అఘోరి మామునూరు శ్మశానవాటికకు చేరుకున్నారు. లోపలికి ఎవరూ రావద్దని, తాను కార్తీక పౌర్ణమి పూజలు చేసుకుంటానని చెప్పి లోపలికి వెళ్లగా.. అఘోరీని చూసేందుకు వచ్చిన వారితో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మామునూరు పోలీసులు వెంటనే బందోబస్తు నిర్వహించారు. శ్మశానంలో పూజల తరువాత బయటకు వచ్చిన అఘోరీ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం ప్రత్యేక పూజలు చేశానన్నారు. ఆలయాలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, గోహత్యలు పెరిగాయని, ధర్మం గాడి తప్పుతోందని అన్నారు. అనంతరం పాదయాత్రగా రంగశాయిపేట, శంభునిపేట, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు, బట్టల బజార్ మీదుగా భద్రకాళి ఆలయానికి చేరుకున్నారు.


ఇల్లందలో కాలభైరవునికి హారతి ఇస్తున్న అఘోరీ నాగసాధు

పాదయాత్రలో అఘోరీతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసిన పుష్పిత లయ, హిజ్రాలు, ప్రజలు పాల్గొన్నారు. అలా భద్రకాళి ఆలయానికి చేరుకున్న అఘోరి అమ్మవారిని దర్శించుకునేందుకు దిగంబరంగా ఆలయంలోకి వెళుతుండగా అధికారులు అభ్యంతరం తెలిపారు. ప్రధాన గేటు వద్ద పోలీసులు, మహిళలు నాగసాధును అడ్డుకున్నారు. చివరికి నాగసాధు వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. లోక క్షేమం కోసం అమ్మవారి వద్దకు వచ్చానని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. త్వరలో జరుగనున్న కుంభమేళాకు వెళ్తానని అన్నారు. ఈ పర్యటన ఆసాంతం అఘోరీ నాగసాధును చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కొందరు దీవెనల కోసం పోటీపడగా మరికొందరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.

19న వరంగల్‌కు

సీఎం రేవంత్‌రెడ్డి రాక

- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- ఆర్ట్స్ కళాశాలలో విజయోత్సవ సభ
- సీఎం టూర్‌పై హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమీక్ష
- నగరంలో ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్లు, సీపీ, అధికారులు

హనుమకొండ/వరంగల్ కార్పొరేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 19న వరంగల్ రానున్నారు. సీఎం తన పర్యటనలో భాగంగా రూ.80కోట్లతో హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. వీటితో పాటు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి 19న ఉదయం హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం బాలసముద్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారు. తర్వాత భద్రకాళి ఆలయ మాడవీధుల అభివృద్ధి పనులు, కాజీపేట వద్ద ఆర్‌వోబీ (బ్రిడ్జి)ని ప్రారంభిస్తారని సమాచారం. మధ్యాహ్నం 12 గంటలకు హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో సుమారు లక్ష మంది మహిళలతో మహిళా సాధికారతపై బహిరంగ సభను నిర్వహిస్తారు. ఈ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి వరంగల్ ఎయిర్‌పోర్టు, మాస్టర్‌ప్లాన్, అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ, వరంగల్ పాలిటెక్నిక్ నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి అంతేకాకుండా భద్రకాళి చెరువు పూడికతీత పనులను కూడా ముఖ్యమంత్రి పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రితో పాటు పర్యటనలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

విస్తృత ఏర్పాట్లు చేయాలి

సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమావేశమై సీఎం పర్యటన రూట్ మ్యాప్, బహిరంగ సభ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా ఏడాదికాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, ముఖ్యంగా స్త్రీ, శిశు సంక్షేమం కోసం అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలు ప్రజలకు సవివరంగా తెలిసేలా ఏర్పాట్లు ఉండాలని నరేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. అలాగే 19న వరంగల్‌లో సీఎం పర్యటన గురించి ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారుడు శ్రీనివాసరాజు, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఐఅండ్ పీఆర్ కమిషనర్ హరీష్, జిల్లా కలెక్టర్లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి నగర పర్యటన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాక కోసం సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు, ప్రారంభించబోయే బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం, కాజీపేట ఆర్వోబీ (బ్రిడ్జి)ని పరిశీలించారు.

అంతేకాకుండా ముఖ్యమంత్రి పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, కుడా, మున్సిపల్ శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతు రుణమాఫీని విస్మరించిన ప్రభుత్వం : బీఆర్ఎస్

ఇనుగుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రూ.2 లక్షలకు పైన ఉన్న రుణాల మాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు బొబ్బిలి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. ఇనుగుర్తిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అందులో సగం మందికే అమలు చేసిందని తెలిపారు. రూ.2 లక్షలకు పైన ఉన్న రుణాల విషయంలో ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని అన్నారు. క్వింటాకు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించి, కేవలం సన్నరకం ధాన్యానికే ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని విమర్శించారు.

బేస్‌బాల్ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

కేసముద్రం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బేస్‌బాల్ అండర్ 17పోటీలకు కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.నవీన్ శుక్రవారం తెలిపారు. హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో పదో తరగతి విద్యార్థిని డి.అజంత, తొమ్మిదో తరగతి విద్యార్థులు బి.పరమేష్, ఎస్.చరణ్‌లు బాలబాలికల విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగావిద్యార్థులతోపాటు పీడీ సమ్మెట లలితను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

108, 102 వాహనాలు తనిఖీ చేసిన మేనేజర్

మరిపెడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అత్యవసర సేవలను అందించే 108, 102 వాహనాలను ఆ సంస్థ జిల్లా మేనేజర్ బత్తిని మహేశ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా వాహనాలలోని వైద్య పరికరాలను, వాటి సేవలను పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు బాధితులకు అందేలా కృషి చేయాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆ వాహన సిబ్బంది రమణ, ప్రవీణ్, బండపల్లి రవి తదితరులు ఉన్నారు.


మహబూబాబాద్ శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


గార్ల మండలం బుద్దారంలో అన్నదానం నిర్వహిస్తున్న గ్రామస్థులు


తొర్రూరు పాటిమీది శివాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బారులు తీరిన మహిళలు


శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, యువతులు

కన్నుల పండువగా కార్తీక పౌర్ణమి వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే స్నానాలు ఆచరించి, దేవాలయాల్లో పూజలు చేశారు. దీంతో ఆలయాలు కిటకిటలాడాయి. సెలవుదినం కావడంతో భక్తులు కుటుంబసభ్యులతో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఒక్కొక్కరు 365 ఒత్తులను వెలిగించారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన 365 ఒత్తులను వెలిగిస్తే సంవత్సరమంతా శివుడికి పూజలు చేసినట్లుగా నానుడి. కురవి మండలం కందికొండలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరకు హాజరైన ప్రభుత్వవిప్ రాంచందర్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు.

శివాలయాలకు కార్తీక శోభ..

జిల్లా పరిధిలోని శివాలయాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తజనం భారీగా వచ్చి పూజలు చేయడంతో ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. శివుడికి ప్రత్యేక పూజలు చేసి తమ కోర్కెలను తీర్చాలని వేడుకున్నారు. పౌర్ణమి రోజున శివుడిని పూజిస్తే సుఖసంతోషాలతో పాటు అష్టఐశ్వర్యాలు తులతూగుతాయని భక్తుల విశ్వాసం. కార్తీక పౌర్ణమి శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావటంతో స్థానిక శ్రీపార్వతిరామలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ అర్చకులు రంగావఝ్ఝల సుధాకరశాస్త్రి-సునిత, చిట్ట శ్రీకాంత్‌శాస్త్రీల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, సర్వదర్శనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే పట్టణంలోని భక్తులు దేవాలయానికి చేరుకోవటంతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. పంచామృతాలతో భక్తులు అభిషేకాలు చేశారు.

- రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలోభాగవతుల వంశీకృష్ణమాచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ సుదర్శన హోమం, మహాపూర్ణహుతి, అభిషేకాలు, లక్షతులసీదళార్చనలు నిర్వహించారు.
- బస్టాండ్ సమీపంలోని శ్రీభక్తమార్కండేయ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కొత్తూరి లక్ష్మీనరసింహమూర్తిశర్మ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు.
- శ్రీగాయత్రిమాత దేవాయలంలో కార్తీకపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని, భక్తులు పూజలు చేశారు.
- అనంతాద్రి స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రావణ్‌కుమార్ వేదమంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వివిధ మండలాల్లో..

- కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళీసమేతవీరభద్రస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- దంతాలపల్లిలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు పెద్దముప్పారం, రేపోని, దాట్లలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రవీందర్, సుష్మిత, వెంకన్న పాల్గొన్నారు.
- నర్సింహులపేట మండల కేంద్రంలో రాజరాజేశ్వర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లోభక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు ఉసిరి, మారేడు చెట్ల కింద దీపాలు వెలిగించారు.
- తొర్రూరులో కార్తీకపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని సారంగేశ్వరస్వామి ఆలయం, శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- గార్ల మండలంతో పాటు ఆయాగ్రామాల్లో శివాలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. బుద్దారంలో ఆంజనేయస్వామి ఆలయంలో విశ్రాంత ఉద్యోగి బాగం కృష్ణమూర్తి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెవుల మహేష్, పల్లెబోయిన నాగరాజు, కట్ట బోసు, వీరస్వామి, బాగం కృష్ణమూర్తి పాల్గొన్నారు.
- బయ్యారం, గంధంపల్లి శివాలయంతో పాటు మండల వ్యాప్తంగా పలు శివాలయాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
- డోర్నకల్‌లో అమ్మపాలెంలోని శివాలయం తో పాటు డోర్నకల్ శివకేశవ క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో దీపాలు వెలిగించారు.
- మరిపెడ శివాలయంలో డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్‌తో పాటు సతీమణి ప్రమీల ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట యుగంధర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, తాజోద్దీన్, అప్సర్, ఉపేందర్,రవికాంత్, పాల్గొన్నారు. అనంతరం.. శివస్వాములకు ముస్లిం యువకుడు రహిమోద్దీన్ అన్నదానం నిర్వహించారు.

'తూకంలో మోసం చేస్తే సహించేది లేదు'


ముదుపుగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన పంటకు తూకంలో మోసం చేస్తే సహించేది లేదని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ మండలం ముడుపుగల్, అమనగల్, సోమ్లతండల్లో ఐకేపీ, అయోధ్యలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతును రాజుగా చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రూ2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 30 తేదీ వరకు అమలు చేయనున్నట్లు చెప్పారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ కూడ ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఏవో తిరుపతిరెడ్డి, ఏపీఎం తిలక్, సీసీ ధనుంజయ, మండల పార్టీ అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, రామన్న, రవీందర్, నాగన్న, గాంధీ, ఉప్పలయ్య, శ్రీనివాస్, సాయిచందర్, పాండు రంగాచారి, లాలు, ధల్‌సింగ్, బాలాజీ, నారాయణసింగ్, సుమలత, శంతన్‌రామరాజు పాల్గొన్నారు.

హుస్సేన్‌నాయక్‌ను కలిసిన ఆదివాసీ నాయకులు

గార్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీతంపేటలో అక్టోబరు 20న గుమ్మడి మహేష్‌ను హత్య సేసిన దుండగులపై కేసు నమోదులో పోలీసులు అనుసరించిన తీరుపై శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను సీతంపేట ఆదివాసీ సంఘం సభ్యులు, గ్రామస్థులు కలిసి వినతిపత్రం సమర్పించారు. హత్య కేసులోని నిందితులు గ్రామంలో యథేచ్ఛగా తిరుగుతూ భయాందోళనలు సృష్టిస్తుంటే, పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని వారు హుస్సేన్‌నాయక్‌కు వివరించారు మహేష్ హత్య విషయంపై విచారణ నిమిత్తంగా సీతంపేటకు రావాలని ఆయనను వారు కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, వీర్యా నాయక్, వీరభద్రం, గోదాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

భగ్నతండాలో యువతి అదృశ్యం


అనూష (ఫైల్)

నెల్లికుదురు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): దుర్గాభవాని తండా శివారు భగ్నతండాకు చెందిన యువతి (20) శుక్రవారం అదృశ్యమైన ట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. భగ్నతండాకు చెందిన అజ్మీర వెంకన్న కూతురు అనూష ఎవరికి చెప్పకుండా ఇంటోనుంచి వెళ్లిపోయింది. తండాలో వెతికినప్పటికి,బంధువులకు సమాచారం ఇచ్చిన ఆచూకి తెలియక పోవడంతో యువతి తండ్రి వెంకన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల వద్ద పూజలు చేపట్టారు. అయ్యప్ప స్వాములకు ఆలయ ఆవరణలో 41 రోజుల పాటు ఏర్పాటు చేయనున్న మహా అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. పాలకుర్తి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలపగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భక్తులందరు ఒకేచోట చేరి పూజలు నిర్వహించుకోవడం అభినందనీయమని, దేవుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నానని, దైవానుగ్రహంతో ప్రతీ ఇంట్లో కార్తీక మాస వెలుగులను వారి జీవితాల్లో నింపాలని ప్రార్థించారు. పట్టణానికి చెందిన రియల్టర్ బొమ్మనబోయిన రాజేందర్ అయ్యప్ప దేవాలయానికి 600గజాల భూమిని వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ దారం ప్రసాద్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, బిజ్జాల వెంకటరమణ, బిజ్జాల అనిల్, వల్లపు మధు, చీదర వీరన్న, సామ రామ్మూర్తి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, దొంగరి శంకర్, కృపాకర్ రాజు, తూనం శ్రావణ్, అచ్చిరెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు ఉన్నారు.

శతాబ్ది వేడుకలను జయప్రదం చేయాలి

తొర్రూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే శతాబ్ది వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. శుక్రవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఏర్పడి డిసెంబర్ 26వ తేదీన వంద సంవత్సరంలో అడుగు పెడుతున్న ఏకైక జాతీయ పార్టీ సీపీఐ అన్నారు. ఈ పార్టీశతాబ్ది ఉత్సవాలు జిల్లా, మునిసి పాలిటీ, మండల, గ్రామాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, లక్ష్మణ్, ఎల్లయ్య, యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి

మరిపెడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గురునానక్ జయంతి వేడుకలను శుక్రవారం మరిపెడ విశ్రాంతి భవనం దగ్గర అక్కడి సిక్కు మతస్థులు ఘనంగా నిర్వహించారు. ఎల్లంపేట సోమ్లాతండా గురుద్వార్ నుంచి మరిపెడ వరకు ర్యాలీ నిర్వహించారు. గురునానక్ చిత్రపటానికి పూల మాలలేసి ప్రత్యేక పూజలు జరిపారు. మత సిద్ధాంతాలను మత గురువులు ఆ మతస్థులకు వివరించారు. షహిద్ భగత్‌సింగ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో మరిపెడ బంగ్లాలోని పేదలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మత గురువు వినోద్‌సింగ్, సుక్యాసింగ్, గులాబీసింగ్, దేవేందర్, సుధాకర్, షేట్యా, సిరి, హర్బజన్‌సింగ్, కొండయ్య, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపునకు దివ్యాంగులు ఉద్యమించాలి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌రెడ్డి

నెహ్రూసెంటర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు రూ.6 వేల పింఛన్‌ల పెంపు కోసం ఐక్యంగా ఉద్యమించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మ నగర్ కాలనీలో వీహెచ్‌పీఎస్ జిల్లాస్థాయి సమావేశాన్ని చలగోల వెంకన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ పాష, అధికార ప్రతినిధిగా భూక్య వెంకన్న, ఉపాధ్యక్షులుగా జెరిపోతుల నారాయణ, బుడిగ శ్రీరాములు, చెడుపాక లక్ష్మణ్, కనిగంటి కృష్ణారెడ్డి, హెచ్.వెంకటేశ్వర్లు, మైస సమ్మయ్య ప్రధాన కార్యదర్శిగా గుగులోతు మోహన్, కార్యదర్శులుగా మార్క రాము, శ్రావణ్, గండమల్ల సంజీవ, బొజ్జ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొండ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా ఉపేందర్, జలేంద్రాచారి, బానోత్ రాము, గుర్రం ప్రభాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ గుగ్గిళ్ల పీరయ్య, ఎండి.రజియా, కత్తుల రేణుక, కందిపాటి బిక్షపతి, ఈదురు సైదులు తదితరుల పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక


పోటీలకు ఎంపికైన సుజాత, వైష్ణవి

నర్సింహులపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శంకర్‌నాయక్ శుక్రవారం తెలిపారు. హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.సుజాత, ఎనిమిదో తరగతి విద్యాభ్యాసం చేస్తున్న ఎం.వైష్ణవి అండర్- 14 బాలికల విభాగం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపడంతోరాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదిల్లో సంగారెడ్డి జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పెద్దవంగర, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందించే తత్వాన్ని అలవర్చుకోవాలని తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ జ్వలిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్‌ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో టీబీ, క్షయవ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ప్రజలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దవంగర నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏదునూరి రేణుక లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాపోలు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

పోడు పట్టాలపై రుణాలకు కొర్రీలు!

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. పోడు పట్టాదారులు రుణాలకు దరఖాస్తు చేసుకుంటే వారి భూమి వద్దకు బ్యాంకు అధికారులు వెళ్లి పరిశీలించి రైతు, బ్యాంకు అధికారి స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి ఫొటోలను తీసుకోవాల్సి ఉంటుంది. వీటితో పాటు సంబంధిత అటవీశాఖాధికారి ధ్రువీకరణపత్రం సైతం తీసుకుంటున్నారు. ఈ కఠిన నిబంధనల నేపథ్యంలో బ్యాంకు అధికారు లు కూడా భూమి వద్దకు వెళ్లి పరిశీలించేందుకు సుముఖత చూపడం లేదు. ఏదైనా తేడా వస్తే తమ ఉద్యోగాలు పోతాయనే భయంతో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు సైతం వెనుకాడుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే పోడు పట్టాలకు రుణాలివ్వకుండా నిలిపివేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ నిబంధనల కారణంగా అసలైన పోడురైతులకు అన్యాయం జరుగుతోంది. మరికొన్ని మండలాల్లో ఎలాంటి పరిశీలన లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా రుణాలను జారీ చేస్తున్నట్లు ప్రచారం కొనసాగుతోం ది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన ధన్నసరి, రంగాపురం, కోమ టిపల్లి తదితర గ్రామాల పోడు రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో వేల సంఖ్యలో రైతులు బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకొని రుణం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రుణాలను ఇవ్వాలని పోడు పట్టాదారులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరిపెడరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి మండలంలోని స్టేజీతండా శివారు చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. చిన్నగూడురు మండలం విస్సంపల్లికి చెందిన బొమ్మ రాము (38) తన ద్విచక్రవాహనంపై పనుల నిమిత్తం మరిపెడ (బంగ్లా)కు వచ్చి తిరిగి అర్ధరాత్రి వెళ్తుండగా మార్గం మధ్యలో స్టేజీ తండా వద్ద నర్సింహులపేట మండలం నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడడంతో రాము అక్కడిక్కడే మృతి చెందాడు. మృతిడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుండెపోటుతో జీపీ కార్యదర్శి మృతి


హరిప్రసాద్ (ఫైల్)

నర్సింహులపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కౌసల్యదేవి పల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆయన స్వగ్రామం మామునూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ (45) ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా డోర్నకల్ మండలం నుంచి నర్సింహులపేట మండలానికి జూన్ మాసంలో బదిలీపై వచ్చి కౌసల్యదేవి పల్లి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. కార్తీక పౌర్ణమిని పురష్కరించుకొని సొంత గ్రామం వరంగల్ జిల్లా మామునూరుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం చాతినొప్పి వస్తుందని ఒక్కసారిగా కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

- గుంతలోకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్న సుధాకర్


గుంతలో పడిన సుధాకర్

సీరోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూతగాదాలో ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సీరోలులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం. సీరోలు నుంచి మన్నెగూడెం వెళ్లే దారిలో గంగాదర్ సుధాకర్‌కు 3 ఎకరాల పొలం ఉండగా, అందులోకి వెళ్లాలంటే పత్తి అనంతయ్య తండ్రి నర్సయ్య వ్యవసాయ భూమిలో నుంచి దారి ఉండేది. కాగా, గత సంవత్సరం నుంచి తన భూమిలో నుంచి వెళ్లనియ్యనంటూ తరచూ గొడవలు పడుతున్నట్లు సుధాకర్ పేర్కొన్నారు. గత 40 సంవత్సరాలుగా మా పొలంలోకి వెళ్లేందుకు ఇదే దారి ద్వారా వెళ్తున్నామని, ఇప్పుడు నీవు అడ్డుపడటం సరికాదని చెబుతున్నప్పటికీ వినకుండా పొలం వద్ద ఉంచిన ద్విచక్రవాహనం ధ్వంసం చేశాడని తెలిపారు. ఈ విషయంపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసున మోదు చేశారని పేర్కొన్నారు. తాజాగా శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ట్రాక్టర్‌పై వస్తున్న అంతయ్య నేరుగా వచ్చి ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో వెంటనే సుధాకర్ కింద పడిపోవడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కిందపడిన సుధాకర్‌పై అంతయ్య ట్రాక్టర్‌ను రివర్స్‌లో ఎక్కించి హత్యాయత్నం చేయబోయాడు. ఇది గమనించిన సుధాకర్ పక్కనే గుంతలోకి వెళ్లి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. సుధాకర్ ఫోన్‌ద్వారా స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లిన స్నేహితులు సుధాకర్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై ఎస్సై నగేష్‌ను వివరణ కోరగా... సుధాకర్ నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జిల్లాలో ఘనంగా బిర్సాముండా జయంతి


మానుకోటలో బిర్సాముండా ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న గుగులోతు కిషన్‌నాయక్, ప్రజాసంఘాల నాయకులు


కొత్తగూడలో బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన బిర్సాముండా ఉద్యమస్ఫూర్తితో గిరిజన హక్కుల సాధన కోసం పోరాడాలని గిరిజన సామాజిక చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం గిరిజన సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిర్సాముండా స్ఫూర్తితో ఆదివాసీ, గిరిజన హక్కుల సాధనకు పోరాటాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి శ్రీధర్, దుడ్డెల రాంమూర్తి, బోడ రమేష్, బానోత్ వెంకన్న, పైండ్ల యాకయ్య, మామిడాల సత్యనారాయణ, న్యాయవాదులు బానోత్ మోహన్, మామిడాల సత్యనారాయణ, అజ్మీర వీరునాయక్, పోలెపాక వెంకన్న, కామ్లానాయక్, రాంబాబు పాల్గొన్నారు.

- టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్ ఆధ్వర్యంలో దేశ మొట్టమొదటి గిరిజన, ఆదివాసీ స్వాతంత్ర్యసమరయోధుడు బిర్సాముండా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌నాయక్ మాట్లాడుతూ అతి పిన్నవయసులో బిర్సాముండా వలసవాద బ్రిటీష్ పాలకులకు వెన్నులో వణుకు పుట్టించారని చెప్పారు. లింగాల వీరభద్రం, దండెబోయిన బుజ్జి వెంకన్న, గుగులోతు నరేష్, తేజావత్ శంకర్‌నాయక్, రాజేందర్, తిప్పర్తి శ్రీధర్, కొత్తయుగంధర్, చెన్న సీతారాములు, ఎస్కే.గఫూర్, లాలు, రాజేష్, దిలీప్ పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాగంటి ప్రభాకర్, జి.వెంకన్న, టి.పర్వతాలు, బాలునాయక్, పి.సునిత, స్వాతి, సౌజన్య, విజయ్, బెనర్జీ పాల్గొన్నారు.
- గార్ల మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ, ఆదివాసీ సంఘంల ఆధ్వర్యంలో వేర్వేరుగా బిర్సాముండా జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జి.సక్కు, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, మంగిలాల్, లక్ష్మీనారాయణ, శాంతమ్మ పాల్గొన్నారు.
- డోర్నకల్ మండలం బూరుగుపాడులో ఆదివాసీనాయక్ పోడు సంఘం ఆధ్వర్యంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేశారు. డిప్యూటీ తహసీల్దార్ వీరన్న, డబ్బా శ్రీను, ముత్తమ్మ, ముత్యాల రావు, అజయ్‌కుమార్, శ్రీరాం, చిర్ర శ్రీను పాల్గొన్నారు.
- కొత్తగూడ మండలకేంద్రంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతిని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆదివాసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు దాట్ల నాగేశ్వర్‌రావు, పూనెం సందీప్, సారయ్య, రాము, భాస్కర్, సాయిలు, వీరస్వామి, గుమ్మడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.
- తొర్రూరు : ఆదివాసీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన జీవిత కాలాన్ని బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాటం కొనసాగించిన ఉద్యమ నేత బిర్సా ముండా అని మండల విద్యా అధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు. ఎంఈవో కార్యాలయంలో బిర్సాముండా జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఉపాధ్యాయులు నాగమల్లయ్య, కిషన్‌నాయక్, భిక్షపతి, మల్లేశం ఉన్నారు.